క్లుప్తంగా

అధ్వానంగా లింగాల రోడ్డు



వత్సవాయి: లింగాల–ఆళ్లూరుపాడు అధ్వాన్నంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డంతా గుంతలమయంగా కావడంతో వాహనచోదకులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆళ్లూరుపాడు ఇసుకు రేవు నుంచి నిత్యం ఇసుక ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు దెబ్బతింది.రెండు గ్రామాల మధ్య రెండు కిలోమీటర్ల దూరంలో పది గుంతలు ఉన్నాయి. వర్షం పడినప్పుడు ఈ గుంతలలో నీరు నిలిచి గుంతలు కనపడకపోవడంతో ద్విచక్రవాహనదారులు అందులో పడుతూ గాయాలపాలవుతున్నారు. ఇసుక ట్రాక్టర్లు తాకిడికి గుంతలు మరింత పెద్దవిగా మారుతున్నాయి. అధికారులు స్పందించి ఈరోడ్డులోని గుంతలను పూడ్చాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధిని చేసేందుకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. పట్టణంలోని 20వ వార్డులో గాయత్రీ అపార్ట్‌మెంట్స్, చాకలిబజారు, అద్దాలబజారు వీధిలో రూ.6లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 20వ వార్డులో డ్రైనేజీ లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యను దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీ నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, 20వ వార్డు కౌన్సిలర్ నోముల స్వప్న, స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత ట్యూషన్ పాయింట్ ప్రారంభం



కంచికచర్ల: కంచికచర్ల అరుంధతీనగర్‌లో అరుంధతీయ విద్యార్థి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ట్యూషన్ పాయింట్‌ను శనివారం రాత్రి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ పి.విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు అరుంధతీ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్న ట్యూషన్ పాయింట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులకోసం సేవా సమితి ఆర్థికసాయం అందజేస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు నకిరికంటి ప్రసాద్ ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ శేషం తిరుమలరావు, సంఘ నాయకులు ముండ్లపాటి పోతరాజు, శేషం గోపాలరావు, నెమలి వాసు, కె.నాగేశ్వరరావు, వేల్పుల ప్రభాకర్, మాడుగుల వాసు, గొర్రెపాటి శ్యాం, టీడీపీ నాయకులు కోగంటి బాబు, వేమా వెంకట్రావు పాల్గొన్నారు.

సత్యసాయికి ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేట అర్బన్: భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని శ్రీసత్యసాయి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశా రు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి క న్వీనర్ కొండ, చిత్రాల వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొని కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆగని కూటమి నేతల విధ్వంసం



నందిగామటౌన్: నందిగామలోని గాంధీసెంటర్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని నాలుగురోజుల కిందట అర్ధరాత్రి వేళ తొలగింపజేసిన కూటమి నేతలు, విగ్రహ ఆనవాళ్లు సైతం లేకుండా చేసేందుకు యత్నిస్తున్నారు. ఈక్రమంలో శనివారం రాత్రి విగ్రహం దిమ్మెను తొలగించిన కూటమి నేతలు, ఆదివారం విగ్రహం తొలగించిన ప్రాంతాన్ని డోజర్‌తో చదును చేసి రోడ్డు వేసే పనుల్లో మునిగిపోయారు. కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ విగ్రహాన్ని తొలగించడమే కాకుండా, ఆనవాళ్లు సైతం లేకుండా చేయాలని కూటమి నేతలు యత్నిస్తుండటం గమనిస్తున్న పట్టణ ప్రజలు 'ఇదేం పోయే కాలం' అంటూ కూటమి నేతల తీరును విమర్శిస్తున్నారు. మొత్తమ్మీద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహ రూపంలోనూ టీడీపీ నాయకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారనే వ్యాఖ్యలు పట్టణ ప్రజల నుంచి వినిపిస్తుండటం గమనార్హం.

రాష్ట్రంలో విధ్వంసక పాలన

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



చంద్రర్లపాడులో క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



చంద్రర్లపాడు కన్వీనర్ కె.నాగేశ్వరరావును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామరూరల్): ఎన్నికలకు ముందు ఇష్టారీతిన హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక ఖజానా ఖాళీగా ఉందంటూ ఆహామీలను తుంగలో తొక్కడం ఒక్క చంద్రబాబుకే చెల్లిందని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. చందర్లపాడు మండలంలోని పున్నవల్లి, చందర్లపాడు గ్రామాల్లో ఆదివారం 'బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఏడాది కాలంగా రా ష్ట్రంలో విధ్వంసక, ఉన్మాద పాలన సాగుతోందన్నారు. భారత రాజ్యాంగాన్ని విస్మరించి లోకేష్ రెడ్‌బుక్‌ను అనుసరించి కూటమి పాలన సాగుతోందని దుయ్యబట్టారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలు అడిగి తే బెదిరింపులు, సమస్యలు పరిష్కరించమంటే దాడులు...పత్రికల్లో వార్త వస్తే కేసులు.. సోషల్ మీడియా లో పోస్టు పెడితే పోలీస్‌స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.

చెత్తబుట్టలో కూటమి మేనిఫేస్టో..

గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫేస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి తన ఛాంబర్‌లో పెట్టుకున్నారని జగన్‌మోహనరావు గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి రాగానే ఎన్నికల మేనిఫేస్టోను చెత్తబుట్టలో పడేశారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఎన్నికల హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు మోసాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. అనంతరం పున్నవల్లి గ్రామ పార్టీ కన్వీనర్‌గా అంగడాల శ్రీనివాసరావు, చందర్లపాడు గ్రామ కన్వీనర్‌గా కొతారు నాగేశ్వరరావులను నియమించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, లాల్‌సా, శాఖమూరు వెంకట కుమారి, కస్తాల పున్నమ్మ, కోట సత్యనారాయణ, గుడేటి శ్రీనివాసరావు, కోట చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడంలో చంద్రబాబు ఘనుడు ..



నందిగామ 20వ వార్డులో 'బాబు షూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

నందిగామ టౌన్: ఎన్నికల సమయంలో హామీలివ్వడం..అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరించి ప్రజలను మోసగించడం సీఎం చంద్రబాబుకు అలవాటుగా మారిందని వైఎస్సార్ సీపీ నందిగామ పట్టణ కన్వీనర్ మహ్మద్‌మస్తాన్ మండిపడ్డారు. నందిగామలోని ఒకటి, 13, 14, 20వ వార్డుల్లో ఆదివారం రాత్రి 'బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్‌మస్తాన్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాల కన్నా ఎక్కువ ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు, అధికారం చేపట్టాక పథకాల అమలుకు డబ్బుల్లేవని చెబుతుండటం హాస్యాస్పదమన్నారు. ప్రజలను ఎలా మోసం చేయాలి.. ఇచ్చిన హామీలను ఎలా గాలికొదిలేయాలనే విషయంలో సీఎం చంద్రబాబు పీహెచ్‌డీ చేశారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు ఈశ్వరప్రగడ రంగారావు, పాములపాటి రమేష్, మువ్వల శ్రీను, షేక్ మున్నా, కర్రి రవీంద్రబాబు, పరిశ మల్లికార్జునరావు, తోట అంజారావు, నాదెండ్ల నరేంద్ర, షేక్‌సుభాని, పోతురాజు, పబ్బతి జగన్, షేక్ జాఫర్, యరగొర్ల రామారావు, చిలుకూరి బుచ్చిరెడ్డి, నాగమ్మ, జ్యోతి, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు తీరని అన్యాయం...

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టడం, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ధ్వంసం చేయడం మినహా ప్రజలకు ఎటువంటి మేలు చేయడం లేదని వైఎస్సార్ సీపీ కంచికచర్ల మండల అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు విమర్శించారు. మండలంలోని పెండ్యాల, గండేపల్లి, కంచికచర్లలో ఆదివారం 'బాబు షూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుచేసే వరకు వైఎస్సార్ సీపీ తరఫున పోరాటం కొనసాగుతుందని తెలిపారు. పార్టీ పెండ్యాల గ్రామకన్వీనర్‌గా షేక్ అబ్దుల్ కరీమ్, గండేపల్లి కన్వీనర్‌గా బెల్లంకొండ సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్ బషీర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మార్త శ్రీనివాసరావు, ఎస్సీసెల్ జిల్లా నాయకులు వేల్పుల రమేష్, ప్రముఖ న్యాయవాదులు మంగలపూడి సన్నీ, మంగలపూడి కోటిబాబు, నాయకులు కర్ల రామకృష్ణ, రాయల నరసింహారావు, సర్పంచి బొక్కా రవికుమార్, ఎంపీటీసీ సభ్యులు షేక్ బడేహజరత్, గడుపూడి సత్యనారాయణ, సంగం దేవరాజు, తలమాల కిషోర్, షేక్ చాన్‌బహదూర్, మట్టా శ్రీనివాసరెడ్డి, సుంకు బాలాజీ, మట్టా చంద్రశేఖరరెడ్డి, దేవరపల్లి చంద్రశేఖరరెడ్డి, కృష్ణా బాలాజీ, కే రంగారావు పాల్గొన్నారు.

కంచికచర్ల పట్టణంలో..

కంచికచర్ల పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కాలవ పెదబాబు, ఎంపీటీసీ సభ్యులు మాదుగుల మధుబాబు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు అమర్లపూడి యోహాన్, నాయకులు వేమా శివకోటి, దేవిరెడ్డి లక్ష్మీనారాయణ, బొక్కిసం భూషణం, పొన్నపల్లి శ్రీనివాసరావు, తుమ్మల గోపాలకృష్ణారెడ్డి, చట్ట రవీంద్ర, బాణావత్ సురేష్, ఉప్పుతల వెంకయ్య, దేవిరెడ్డి శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, గుగులోతు శివనాయక్, దాసరి రాంబాబు, ఎం పాండురంగారావు, మండల శివ, మంగినేని బుడ్డియ్య, బడేటి మల్లి, మాదుగుల ఆంజనేయులు, వేముల గోపీ, చట్టి రవీంద్ర, ఆకుల రామారావు, చట్టి పద్మ, గొర్రెపాటి బాబు, కోనాల దూండీ తదితరులు పాల్గొన్నారు.



నందిగామ 13వ వార్డులో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



పెండ్యాలలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న బండి మల్లికార్జునరావు, ఎంపీపీ మలక్‌బషీర్

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు ఆదివారం తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని ఆయన సూచించారు.

గర్భాలయ దర్శనం నిలిపివేత

నందిగామ రూరల్: పట్టణంలోని రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా గర్భాలయ పూజలు, దర్శనాలను నిలిపివేస్తున్నట్లు ఈవో సురేష్ ఆదివారం తెలిపారు ఈ నెల 11 నుంచి సెప్టెంబరు 29 వరకు దర్శనాలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. భక్తులు బాలాలయంలోని స్వామి వారిని దర్శించుకోవచ్చని చెప్పారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరారు. ఆలయంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక విలియంపేటలోని గ్రీన్‌సిటీ వద్ద సోమవారం ఉదయం 8 గంటలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జయప్రద ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా నరసింహారావు తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా మూడురోజులపాటు నిర్వహించిన వైద్యశిబిరంలో మొత్తం 704 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్దన్ తెలిపారు.

సొసైటీలకు త్రీమెన్ కమిటీ నియామకం

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రంలోని పలు సహకార సంఘాలకు త్రీమెన్ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు జగ్గయ్యపేటలోని గోపాలకృష్ణ విశాల సహకార పరపతి సంఘానికి చైర్‌పర్సన్‌గా తెలుగు యువత నాయకుడు ధూళిపాళ్ల లక్ష్మణరావు, సొసైటీ సభ్యులుగా మాజీ కౌన్సిలర్ గుంజ ఏడుకొండలు, గోగుల వసంత, కృష్ణా ఫార్మర్స్ సొసైటీ చైర్‌పర్సన్‌గా అనుమంచిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ రైతు నాయకులు యానాల గోపీచంద్, సొసైటీ సభ్యులుగా వేదాద్రి గ్రామానికి చెందిన మూడు సునీత, షేర్‌మహ్మద్‌పేటకు చెందిన మెట్టెల రామారావు నియమితులయ్యారు.

17న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

విజయవాడ కల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17వ తేది ఆదివారం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు సేవా సంఘం ప్రధాన కార్యదర్శి దశరథ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిచయ వేదికలో పాల్గొనేవారు స్వయంగా వేదిక దగ్గర, లేదా సెల్‌నంబర్లు 99660 96999, 96181 93027లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వీరులపాడు: మండలంలోని వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 2007–08 పదోతరగతి విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై ఆనందోత్సాహాలతో గడిపారు.ఒకరినొకరు యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. చదువుకున్న నాటి సంగతులను గుర్తుచేసుకున్నారు.

అనంతరం అప్పటి ఉపాధ్యాయులు నరేంద్ర, నాగరాజు, పద్మప్రియ తదితరులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు త్రినాద్‌రెడ్డి, ఆదం బాషా, గోపాలకృష్ణ, మనోజ్, శ్రీనివాస్, వీరాంజనేయులు, సుభాని, నంద్రు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి శీఘ్రదర్శనంలో భక్తులు



బోనాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారి నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి యున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు శ్రావణ మాసం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలుపొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. అమ్మవారి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.



ఆలయం బయట భక్తుల సందడి

అలుగు కాలువలో పూడిక తీయించండి సారూ!

- పూడికతో నిండిన అలుగు కాలువ
- నజావుగా ముందుకు సాగని వరద నీరు
- పంటపొలాలను ముంచెత్తుతున్న వైనం
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- దెబ్బతింటున్న రోడ్డు
- పట్టించుకోని పాలకులు



పూడిక తీయాల్సిన చెరువు అలుగు కాలువ

పెనుగంచిప్రోలు: మండలకేంద్రం పెనుగంచిప్రోలులోని చెరువు అలుగు కాలువ పూడికతో నిండి ఉండటంతో వర్షాలకు వరద నీరంతా పొలాలపై పడి పంటలు నీటమునుగుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చెరువు అలుగు కాలువ సుబ్బాయిగూడెం వరకు సుమారు ఐదు కిలోమీటర్లు మేర ఉంది. పెనుగంచిప్రోలు చెరువు నిండితే అలుగు కాలువ ద్వారా నీరు ప్రవహించి సుబ్బాయిగూడెం వద్ద మునేరులో కలుస్తూ ఉంటుంది. అయితే కాలువ మొత్తం పూడిపోవడంతో వరద నీరు వచ్చినప్పుడల్లా నీరు ముందుకు సాగక పక్కనున్న పంట పొలాలపై ప్రవహిస్తూ వరి పొలాలను ముంచేస్తుంది. ఉపాధిహామీ పనుల ద్వారా అప్పుడప్పుడు తాత్కాలికంగా కాలువలో పూడిక తీస్తున్నా, పూర్తి స్థాయిలో పూడిక తీయకపోతుండటంతో భారీ వర్షాల సమయంలో పంటలు నీటమునుగుతూ రైతులకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. ఈ నీటి ఉధృతికి అలుగులు వద్ద సుబ్బాయిగూడెం వెళ్లే రహదారి కూడా ఏటా దెబ్బతింటోంది. రోడ్డు కింద తూములు వద్ద కూడా పూడిక తీయకపోవడమే ఇందుకు కారణం. ఇకనైనా ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి అలుగు కాలువలో పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



కాలువ పూడిపోవడంతో ఇటీవల పొలాలను ముంచేసిన వరద నీరు(ఫైల్)



వరద నీటి ఉధృతికి దెబ్బతిన్న సుబ్బాయిగూడెం రహదారి

వరద ఉధృతికి అప్రోచ్ రోడ్డు ధ్వంసం



వరద ఉధృతికి ధ్వంసమైన అప్రోచ్ రోడ్డు

వీరులపాడు: ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ఎగువ నుంచి వచ్చిన వరద ఉధృతికి పల్లెంపల్లిలోని వైరాకట్టలేరు అప్రోచ్ రోడ్డు ధ్వంసమైంది. ఈ రోడ్డు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతుండటంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వరదల కారణంగా రహదారిపై ఉన్న సిమెంట్ దిమ్మెలు దెబ్బతిన్నాయి. వైరా కట్టలేరుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటికీ అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిగాకపోవడంతో వరదల సమయంలో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరదల సమయంలో రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కంచికచర్ల, వీరులపాడు వెళ్లేందుకు వాహనచోదకులు కిలోమీటర్ల కొద్దీ అదనపుదూరం ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నిర్మాణం పూర్తయిన బ్రిడ్జి ద్వారా రాకపోకలు ప్రారంభించేందుకు అవసరమైన పనులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.